

# అనుభూతి మిగిల్చిన ఆనందం

తమిరి సూర్యకుమారి

సంధ్య చీకట్లు అలుముకుంటున్నాయి.

నాలుగు రోజులనుండి సన్నసన్నగా చినుకులు పడుతుండటంవలన సాయంత్ర పూట చల్లనిగాలివీస్తోంది. ఆ ప్రాంతంలో ఏ అలజడీ లేదు. అంత నిశ్శబ్ద వాతావరణంలో సముద్రపుకెరటాల మృధుగంభీర ధ్వని వింటూ ఇసుకలో కూర్చొని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు చెందు. చీకటి పడిందని అక్కడ ఎవరూ లేరని తెలిసి కూడా అతను ఏం భయపడలేదు కానీ బాధపడ్డాడు. ఈ సువిశాల ప్రపంచంలో ఏ తోడూ నీడాలేని ఒంటరివాడు తను. తన కష్టసుఖాల్లో భాగం పంచుకునేందుకు తనను ఆదరించి అభిమానించేందుకు తనకు ఎవరూ లేరు. ఇలా అనుకోగానే దుఃఖం ముంచుకువచ్చిందతనికి.

"ఎవరూ లేరా? నిజంగా నాకెవరూ లేరా?" అంతరాత్మ నిలదీసింది.

"అన్నీ తెలిసిఉండీ నువ్వుకూడా ఇలాగే అడుగుతున్నావా? పోనీ నువ్వు చెప్పు నాకెవరున్నారో" అన్నాడు జాలిగా. కోపంగా.

పకపకా నవ్వినట్టు అనిపించింది. "నువ్వు ఎవరినైనా మోసం చెయ్యగలవేమోకానీ నన్ను మోసం చెయ్యలేవు. నేను నీ అంతరాత్మని. నీకు సంధ్య లేదూ?" అంది నిలదీసినట్టుగా.

"సంధ్య" అతని పెదవిపై విరు దరహాస రేఖ మెరిసి మాయమయ్యింది. "సంధ్య" మళ్లా ఉచ్చరించాడా నామాన్ని. "అవును ఆమె తోడుగా ఉండేది ఒకప్పుడు. ఎలా వచ్చిందో అలాగే వెళ్లిపోయింది. నేనున్నంతకాలం నాతో ఉంటే నేను ఒంటరినెలా అవుతాను"

"హుం! ఎంత ఆశ నీకు? వేలుచూపితే మండకొరికేలా వున్నావ్. సంధ్యేకాదు మరెవ్వరైనాసరే నీకు తోడుగా ఉండరు. నీకెవ్వరూలేరనే ఆలోచిస్తునావు కానీ. నీలో ఎంత స్వార్థముందో తెలుసుకోలేకపోతున్నావు. నీకోసం మరొకరి జీవితాన్ని కోరుతున్నావు అంతేకదూ" కసిరినట్టుగా అంది అంతరాత్మ.

ఆలోచిస్తున్నకొద్దీ అదీ నిజమే అనిపించింది. తెలిసే తను బాధపడ్డం అనవ

పించింది. తెలిసే తను బాధపట్ట అనవసరం. తనకి తెలియని తనలాంటివాళ్లు ఇంకా ఎందరో! అందరూ తనలాగే బాధపడుతుంటారేమో! సంధ్య అనేది. "చెందూ! దేవుడు చాలా చెడ్డవాడు కదూ? లేకపోతే కొందర్ని డబ్బున్నవాళ్లగా, కొందర్ని లేనివాళ్లగా, మరికొందర్ని అవిటివాళ్లగా, ఇలా రకరకాలుగా పుట్టించి బాధపెట్టటం ఎందుకు? అందుకే నాకు దేవుడంటే కోపం" అనేది ఆవేశంగా.

"అదేంకాదు సంధ్యా. దేవుడు చాలా మంచివాడు కనుకనే నన్ను ఇలా పుట్టించాడు. నేను నీకు దగ్గరయ్యే అవకాశం లభించింది. నేనుకూడా నీలాగే పుడితే నన్ను ఇంత ఆప్యాయంగా చూసేదానివా?" ఎంత తేలిగ్గా అనాలనుకున్నా చిన్నగా కంపించేది గొంతు. "చెందూ ఇంకోసారి ఇలా మాట్లాడితే నామీద ఒట్టే" అనేది, ఏం అనాలో తెలీక. టపటపా చినుకులుపడ్డాయి. అయ్యబాబోయ్ వర్షం వచ్చేటట్టు ఉంది అనుకొని లేచి కిందఉన్న తువ్వాలు తీసి పైమీద వేసుకొని తొందర తొందరగా నడుస్తూ గుదిసెకు చేరుకున్నాడు. కాళ్లూ, చేతులు కడుక్కొని కిటికీలో ఉన్న రొట్టెముక్క తీసుకొని నీళ్లుతాగి చాపవేసుకొని మేను వాల్చాడు.

నిద్రిస్తున్నట్టే ఉంది కానీ రావటం లేదు. రెండు రోజులనుండీ ఇదే బాధ. అసలు నిద్ర ఎందుకు రావటంలేదు. ఏవేవో జ్ఞాపకాలు, జరిగిపోయిన తియ్యటి రోజులు నీలినీడల్లా వెంటాడుతూ ఉన్న శాంతిని లేకుండా చేస్తున్నాయి. కాదు, తియ్యటి రోజులు అనుభవించబట్టేకదా ఇప్పుడిలా తలంచుకొని ఆనందాన్ని పొందకల్గుతున్నాడు. ఆనందం? తనకా? కలలోకూడా ఆ పేరు ఎత్తే హక్కులేదు తనకు, చిన్నగా నవ్వుకున్నాడు. "చెందూ! నువ్వు నవుతుంటే ఎంత బాగుంటుందో తెలుసా?" సంధ్య.

అబ్బ ఈ సంధ్య జ్ఞాపకాలు తను మరిచిపోగలడా? ఎన్నో మాటలు చెప్పి, తనను మురిపించి మరిపించి నవ్వించేది. "ఇదుగో నేనున్నంతసేపు ఏ ఆలోచనలూ చెయ్యకూడదు. నువ్వలా బాధపడితే నాకూ బాధగా ఉంటుంది." అనేది. "ఒద్దు, వద్దు సంధ్యా నువ్వలా అనకు" అనేవాడు కంగారుగా.

పకపకా నవ్వేది. మాసావా? "నేనంటే నీకు అభిమానం, నేను బాధపడితే నువ్వు ఓర్చుకోలేవు.దీనికేంగానీ, ఓ పాటపాడు" అనేది సంభాషణ మార్చాలని. ఆమె కిష్టమైన పాట పాడి వినిపించేవాడు. ఒకటా? ఎన్నో! తనకు వచ్చినవన్నీ పాడించుకునేది. ఏదీ? ఆ సంధ్య ఏదీ? ఒక్సారి నా దగ్గరగావచ్చి "నేను వచ్చాను చెందూ, నీకోసం వచ్చేశాను"అంటే ఎంత బాగుంటుందు. తల ఇటూ అటూ తిప్పి కళ్లు మూసుకుని పడుకోవాలని ప్రయత్నించాడు. కళ్లైతే మూతలుపడ్డాయి గానీ,

గతంమాత్రం కళ్లెంలేని గుర్రంలా వెనక్కి పరిగెట్టింది.

* * *

"అబ్బాయ్ ఎవరు నువ్వు?—"

ఇసుక చేత్తో పట్టుకొని జారవిడుస్తూ, మళ్లీ గుప్పెటనిండా తీసి మళ్లీ పోస్తూ సన్నగా ఏలపాట పాడుకుంటున్న చెందు పాట ఆపేసి తల అటూ, ఇటూ ఆడించాడు.

"నిన్నే ఎవరబ్బాయివి నువ్వు" మరి కొంచెం దగ్గరగా వినబడిందా ప్రశ్న.

కొద్దిగా తడబడ్డాడు. ఈ ఇరవై ఏళ్లల్లోనూ తనను అలా ఎవరూ అడగ లేదు. రోజూ ఏ సమయంలో వచ్చినా, ఎన్ని పాటలు పాడుకున్నా ఎవరూ ప్రశ్నించలేదు.

"నీకు మాటలు రావా?" కొంచెం విసుగ్గా.

"మీ రెవరు?" అన్న ప్రశ్నగా విని, తనూ ఎదురు ప్రశ్న వేశాడు.

"నే నెవరో కనిపించటంలేదా?"

ఒక నిమిషం తరువాత వెక్కి వెక్కి ఏడ్చాడు.

"ఏయ్ ఎందుకు-ఎందుకేడుస్తున్నావు?" కంగారు ధ్వనించింది.

అంత బాధలోనూ అతను ఆశ్చర్య పోయేలా గాజుల గలగలలు వినిపించాయి. అయితే తన ఎదుట ఉన్నది అమ్మాయి. ఆ నిజాన్ని నమ్మటానికి చాలాసేపు పట్టింది.

"నేను గుడ్డివాడ్ని" అన్నాడు గొంతు పెగుల్చుకొని.

"ఆ" అచేతనంగా నిలబడి పోయిందామె.

ఆమె ఇంకా అక్కడే ఉందని, గాలికి ఎగిరే ఆమె చీర రెపరెపలు, బరువు నిట్టూర్పు తెలిపాయి.

"మీరు-మీరెవరో కానీ...." అన్నాడు.

"నా పేరు సంధ్య. నాలుగు రోజులుగా నేను నీపాట వింటున్నాను. ఇలా అడిగానని ఏమనుకోకేం?" కొంచెం బాధగా అని, "నిజంగా నీకు కళ్లు లేవా" అంది నమ్మలేనట్టు.

"ఎందుకలా అడుగుతున్నారు?"

"నువ్వు చాలా బాగున్నావు. నిన్ను చూస్తే గుడ్డివాడివనిపించటంలేదు" అంది ఇంకాఅపనమ్మకంగా. "అవును అందరూ అనుకుంటారు. తెల్లగా పొడుపుగా ఉంచె నల్లటి ఉంగరాలజుత్తు. చక్కగా ఉంటాడు తను. కానీ తన అందం తనకే తెలీదు.

"నువ్వు ఎక్కడుంటున్నావు?"

"ఇక్కడే- అటువైపు యోగాశ్రమం దగ్గరగా" అన్నాడు. అని ఆమెతో సంభాషణ ఇష్టంలేనట్టు వెళ్లటానికి లేచాడు.

"అరే! వెళ్లిపోకు, పడిపోతావు. ఎవరూ రారా నీకోసం" ఆతృతగా అడిగింది.

వెళ్తున్న అతను ఒక్క క్షణం ఆగి, "నా కోసం ఎవరూ రారు. నా కెవరూలేరు, పుట్టగానే తల్లీ- ఊహ తెలిసాక తండ్రీ

పోయారు" గబగబా రెండడుగులు వేసాడోలేదో ఆమె కూడా పరిగెత్తుకొస్తున్నట్టు అనిపించి ఆగిపోయాడు.

"నువ్వు! అదే మరి నీకు భోజనం ఎలా?" అతన్ని చూడగానే ఏదో ఆకర్షణశక్తి ఆవరించిందామెను. పరాయి వ్యక్తి, మగవాడు అనిపించలేదు. ఎన్నో ఏళ్ల పరిచయం ఉన్నదానిలా మాట్లాడుతుంటే అతనికి చిరాకు, బాధ, ఆశ్చర్యం. గందరగోళంగా ఉంది మనసు.

"నేను ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకు" అంది నింపాదిగా.

ఇంక లాభం లేదని అక్కడే కూర్చుండిపోయాడు. "నాకు కళ్లు లేవు కానీ అన్నిపనులూ వచ్చు. వలవేసి చేపలుపట్టి మా ఇంటిదగ్గరి వాళ్లకు ఇస్తుంటాను. వాళ్లు నాకు అన్ని సదుపాయాలు-అంటే అన్నం అవీ చూస్తారు" అన్నాడు మొహమాట పడుతున్నట్టుగా.

"అంటే జాలరివాళ్లు మీరు." ఆమె సందేహం.

అబ్బ! ఏం ప్రశ్నలు? విసుగ్గా అనుకున్నా వింతగానే ఉంది. తనతో ఇంతవరాకా ఇలా మాట్లాడినవాళ్లే లేరు. ఎగతాళిగా, జాలిగా ఉంటారేకానీ, ఆదరంగా చూడరు.

"పోనీలే నీకు నామీద కోపం వచ్చింది కాబోలు నే వెళ్లిపోతున్నానులే!"

"అబ్బే కోపంలేదు. ఇలా కూర్చోండి. నేను పుట్టుగుడ్డివాణ్ణి. కానీ ఉన్నత కుటుంబంలోనే పుట్టాను. నేను పుట్టగానే జబ్బుచేసి మా అమ్మ చచ్చిపోయింది. నాకంటే పెద్దవాళ్లు ఇద్దరూ మగవాళ్లే. నాకు కళ్లులేకపోవటం వాళ్లకు చిన్నతనంగా, అసహ్యంగా అనిపించి నన్ను నానాబాధలు పెట్టేవారు. చివరకు వాళ్ల పోరుపడలేక నన్ను తీసుకొని మా నాన్న ఇక్కడకు వచ్చేసాడు. అప్పటినుండి ఇలా చేపలుపట్టటం నేర్చుకున్నాం. కానీ వయసుడిగి, తిండిలేక నాన్నకూడా చచ్చిపోయాడు. నేను ఇలా ఒంటరిగా మిగిలిపోయాను." గబగబా అన్ని వివరాలూ చెప్పేసాడు. తనకోసం వచ్చిన దేవత వెళ్లిపోతుందేమో అన్న భయంతో.

పకపకా నవ్వింది. సముద్రపుటలలు ఆమెతో పోటీపడ్డట్టుగా ఒక్కసారి ముందుకువచ్చి వెనక్కి పోయాయి.

అంత చక్కగా నవ్వే ఆమె ఎలా ఉంటుందో? నాలా చాలా బాగుంటుందా? హుఁ నేను ఎలా ఉంటానో నాకే తెలీదు. అమాంతం వెళ్లి ఎదురుగా ఉన్న సముద్రుడి ఒడిలో తలదాచుకోవాలనిపించింది.

"నేనడిగితేనే కానీ నువ్వేం మాట్లాడవేం?" అంది చిరుకోపంగా.

"ఇంకేం మాట్లాడాలి అమ్మాయిగారూ! నా పేరు చెందు. అన్నీ చెప్పేసానుగా" అన్నాడు చిన్నపిల్లాడిలా.

"అమ్మాయిగారా?" ఆశ్చర్యంగా అనుకొని "అవునూ, ఇంత చక్కగా



మాట్లాడుతున్నావు నువ్వేమైనా చదువు కున్నావా ?" అంది.

"ఎంత పిచ్చి ప్రశ్న. నాకేంచదువు-నామాట అంతే !" అన్నాడు.

"సరేలే ! చీకటి పడబోతుంది. రేపు వస్తాలే !" అంది వెళ్లటానికి లేస్తూ.

"నిజంగా రేపు వస్తారా ?" ఏదో తెలియని ఆనందం, రవ్వంత ఆశ ఇను మడించిందా గొంతులో.

"ఓ తప్పకుండా !"

క్రమేపీ ఆమె దూరమయినట్లు వినిపించి, ఏదో అనిర్వచనీయమైన అనుభూతి చెందుతూ ఇంటికి వెళ్లాడు. ప్రొద్దుట అన్నం వుందికానీ తినబుద్ధి కాలేదు.ఎవరో ఆమె ఎంత బాగా మాట్లాడింది. అయ్యో ! ఎక్కడ ఉంటుందో? చదువుకుంటుందా ? డబ్బుగలవారి అమ్మాయా ? ఛ ఏమీ అడగలేదు. అసలు అలా ఆమె వచ్చి మాట్లాడగానే ఏంతోచలేదు. ఆలోచనలతోనే నిద్రలోకి జారి పోయాడు.

* * *

తెల్లటి తెలుపు. ఉంగరాల జుత్తు. లావు, పొడవు సరిగ్గా నాయుడిబావలా ఉన్నాడు. పంచెకట్టు, బనీను చూసి ఏ రైతుకాదుకో అనుకొని పొరపాటు పడింది. పాపం ఎన్నో ప్రశ్నలు వేసి అతన్ని బాధపెట్టింది. అతను ఎలా ఉంటున్నాడో! ఒక్క నిమిషం కరెంటు పోతే దీపపుబుడ్డి కాంతిలో దిక్కుతోచక అల్లాడిపోతాం. జీవితమంతా కటిక చీకటి అనుభవిస్తూ ఎలా ? అబ్బ అతని గురించి ఇంత ఆలోచనెందుకు తనకి- అతని పాటకు ఆకర్షితురాలయ్యిందా ? లేక అతని రూపానికా ? ఛ ! ఛ ! రోజూ నెల్లాళ్లబట్టి అంటె పరీక్షలు అయిపోయి ఇంక చదివేపని లేదుకదా అని ఈవెనింగ్ షైర్‌గా బీచ్‌వైపుకు వెళ్లటం అలవాటు

చేసుకొంది. దూరాన విన్న ఈలపాట— దగ్గరగా వచ్చి చూసింది. అబ్బ ఎంత చక్కగా పాడుతున్నాడు. తనకు ఆ పార వశ్యంలోనే అతన్ని పలకరించింది కానీ తనకు మరే ఉద్దేశ్యం లేదు. తనకు తానే సర్దిచెప్పుకుంటూ హాయిగా నిద్ర పోయింది.

*    *    *

"చెందూ !" దూరంనుండి పిలుస్తూ పరిగెట్టి అతని దగ్గరగా వచ్చేసింది.

"వచ్చారా ?" సంతోషాన్ని పట్టలేక కన్నీళ్లొచ్చాయి అతనికి.

"ఎందుకు చెందూ ?" అనురాగంగా అడిగింది.

"లేదండి. మీరు వచ్చారంటే నాకు చాలా ఆనందంగా ఉంది. నేను చాలా అదృష్టవంతుణ్ణి. ఒంటరిగా బ్రతుకుతున్న నాకు తోడుగా దేవుడు మిమ్మల్ని పంపాడు." అన్నాడు.

"అబ్బ! దేవుడు. ఎవరా దేవుడు? నిన్ను గుడ్డివాణ్నిచేసి ఏడిపిస్తున్నాడు." అంది కోపంగా. బాధ మరిచి నవ్వాడు. "నిజంగా దేవుడి దయే అమ్మాయిగారూ. లేకపోతే మీరు నన్ను ఇలా పరామర్శించి, పలకరించారంటే దేవుని దయే కదా ?" అన్నాడు.

"ఏంకాదు. నేను నీ పాట విని నిన్ను చూసి అభిమానించాను." అంది మొండిగా.

"పోనీలెండి. దేవుడంటే మీ కిష్టం లేనట్టుంది." అన్నాడు ఆ సంభాషణ త్రుంచేస్తూ.

"ఇంద, ఇది తీసుకో" అంది కాయితం పొట్లం అతని చేతికిస్తూ.

"ఏమిటివి?" అనుమానంగా అడిగాడు.

"ఉండు చెప్తాను" అని పొట్లం విప్పి ఒక జిలేబీ తీసి అతని చేతికందించింది.

"అమ్మాయిగారూ !" ఆక్రోశించింది అతని హృదయం.

"ఏం తినవా?" చిన్నబోతూ అడిగింది

"మీరు, మీరు "

"తిను చెందూ ! నీ కోసం అమ్మను అడిగి తెచ్చాను" అంది.

అతను మొహమాట పడ్డాడు. ఎవరో ముష్టివాడికి పెట్టినట్లు పెడితే తీసుకుని తింటాడా తను. చాలా అవమానంగా కూడా తోచింది.

"నాకు వద్దు, తీసుకోండి" అన్నాడు తిరిగి ఇచ్చేస్తూ.

"అదేం? చెందూ నువ్వేదో అనుకొని బాధపడుతున్నావు కానీ, నేను నిజంగా అంత దూరంనుండి నీకోసం తెచ్చానే! నీ కిష్టం లేకపోతే బలవంతం లేదులే !" అంది కించిత్ బాధాస్వరంతో.

అవును తనేదో వెధవాలోచనతో తిక మకపడుతున్నాడు కానీ, ఇలా ఎవరైనా పిల్చి ఏనాడైనా తనకు పెట్టేరా మౌనంగా చెయ్యి చాపి ఆమె ఇచ్చిన జిలేబి అందుకున్నాడు.

"చూడు— ఈ రోజు నుంచి మనం

స్నేహితులం. నాకు ఈలపాట అంటే చాలా ఇష్టం. రోజూ నువ్వు తప్పకుండా పాట పాడి వినిపించాలి. నేను ఏమిచ్చినా తీసుకోవాలి. నీ కేదైనా కావాలంటే అడుగు. ఇంక నేను వెళ్తాను" అంది గట్టిగా చెపుతూ. అలాగే, అలాగే అని బుర్ర ఊపటం తప్పితే వేరొక మాట మాట్లాడ లేదు.

* * *

రెండు రోజులు రెండు యుగాల్లా గడిపాడు. రోజుకన్నా ముందుగానే వచ్చేశాడు. అతని చెవులు పరిచయమైన గాజుల గలగలకోసం, చీర రెపరెపల కోసం ఆతృత పడుతున్నాయి.

"చెందూ !" ఏదో తెలియని సంతోషంతో మతాబులా వెలిగిపోతున్న ఆమె మొహాన్ని చూడకపోయినా ఏదో విశేషం ఉందని గ్రహించాడు.

"ఏం టమ్మాయిగారూ— ఈ రోజు చాలా ఆనందంగా ఉన్నారు" అన్నాడు నవ్వుతూ.

"ఇదిగో ఇంకోసారి అమ్మాయిగారూ బొమ్మాయిగారూ అని పిలిచావా చూడు" అని బెదిరించింది.

చిన్నగా నవ్వి "మీరు చదువుకున్న వారు, పెద్ద కుటుంబంలో పుట్టారు." అతని మాటలను మధ్యలోనే ఖండించింది.

"చూడు అలా భేదాభిప్రాయాలు ఉంటే నేను ఇంత సరదాగా నీతో మాట్లాడతానా?" అంది కోపంగా. ఆమెకు కోపం వచ్చిందని, బాధపడుతుందని గ్రహించి, ఛీ! తనెంత మూర్ఖుడు. తనకు ఆలోచించే విధానం తెలియదు. అనుకొంటూ. "ఒట్టు ఇంకోసారి ఇలా మాట్లాడను. చెప్పండి మీ రెందుకు సంతోషంగా ఉన్నారు" అన్నాడు.

ఆమె బుగ్గల్లోకి వెచ్చటి ఆవిరి వచ్చింది. కళ్లల్లో సిగ్గులు దోబూచులాడాయి. కానీ, ఆమె అలా మౌనంగా ఎందుకు ఉండిపోయిందో తెలీక "అమ్మాయిగారూ— అహఁ సంధ్యాగారూ" అని పిలిచాడు.

దిక్కులు పిక్కటిల్లేట్లు నవ్వింది. "బాగుంది చాలా బాగుంది సంధ్యా అన లేవు. నిజానికి నేను నీకంటే చిన్నదాన్ని అయ్యుంటాను" అంది నవ్వాపుకుంటూ. బుర్ర గోక్కున్నాడు.

అబ్బ! ఈమెతో ఎలా మాట్లాడినా ఇబ్బందే!

"చెందూ! ఏరేం! పెళ్లి సంబంధం కుదిరింది చెందూ" అంది అతనికి చెప్పే విధానం ఎలాగో తెలీక.

"ఎవరికి?" అయోమయంగా అడిగాడు.

"అబ్బ! ఫో నువ్వు తెలిసే మరీనూ."

ఆ మాటల్తో తెలుసుకున్నాడు— పెళ్లి ఆమెకేననీ! ఆమె సిగ్గుతో వంపులు తిరుగుతుందని. అతనికి షాక్ తగిలి నట్టయింది. అంటే ఆమె ఎన్నో రోజులు

తనతో ఉండదన్నమాట. ఈ ఆనందం ఆ అనుభూతి తాత్కాలికం. మరి కొన్ని రోజుల్లో ఆమె వెళ్ళిపోతే ఎప్పటిలా ఒక్కడూ, ఒంటరిగా ఈ చీకట్లో సముద్రపు ఘోష వింటూ, పాటలు పాడుకుంటూ మళ్లీ మామూలుగా.

"చెందూ అలా వున్నావేం?" తుళ్లి పడ్డాడు. "అబ్బే ఏం లేదు. నాకు చాలా సంతోషంగా ఉంది. అన్నట్టు మీ ఇంట్లో ఇంకా ఎవరెవరు ఉన్నారు?" అడిగాడు.

"నేను, అమ్మా, నాన్నగారూ, ఒక చెల్లి, తమ్ముడు" అంది అతనివైపే సూటిగా చూస్తూ. కానీ అతడు ఎందుకో బాధపడుతున్నాడని తెలుసుకొంది. "పోనీలే కానీ నే పాట పాడుదూ" అంది ఎప్పటిలా.

"హుఁ పాడాలి. అవును. ఆమె తన పాటకోసమే తన దగ్గరకు చేరింది. ఆమె కిష్టమైన పాటలు విని! ఆమె కోర్కె తీర్చుకొనేందుకు తనతో పరిచయం పెంచుకొని మురిపించి మరిపింపచేసింది. కానీ ఆమెకు తనపై ఎలాంటి అభిప్రాయం లేదు."

"ఏమిటి చెందూ ఈ రోజు అలా ఉన్నావు? నీ మనసు బాగోలేనట్టుంది, రేపు పాడుదుగానిలె" అంటూ వెళ్లిపోయింది. ఆమె తన గుండెలమీద నుండి నడిచి నిర్దాక్షిణ్యంగా పోతున్నట్టు ఫీలయ్యాడు.

"వచ్చారా! ఈ రోజు రారేమో అనుకున్నాను" అన్నాడు.

"ఉ" బరువుగా మూల్గిందామె. "పెళ్లికి ముహూర్తాలు పెట్టించారు. నేను రాకూడదని అమ్మావాళ్లు అంటున్నారు. అయినా అదీ నిజమే కదా! అయినా ఇంకా రెండు మూడు రోజులే కదా అని మొండిగా వచ్చేశాను. నీతో స్నేహం పెంచుకొని, ఎంతో కాలం కాకుండానే వెళ్లిపోతున్నాను. మళ్లా నీ పాట వినే అదృష్టం ఎప్పుడో! చెందూ! నేను రోజూ నీ చేత పాడించుకుంటన్నానని నన్ను తిట్టుకోటం లేదు కదా" అంది నవ్వుతూ.


"లేదు, మీ కెలా చెప్పాలో తెలియదు కానీ, మీరంటే నాకు చాలా ఇష్టం" అన్నాడు.

"చెందూ" గొంతుకలో ఏదో అడ్డు పడ్డట్టు బొంగురుపోయింది.

"అవును. ఒంటిగా, గుడ్డిగా బతుకుతున్న నన్ను దయతో చేరదీసారు. మీరు నాకు దూరమయినా మీ మాటలు గుర్తు చేసుకుంటాను" అన్నాడు గంభీరత తెచ్చి పెట్టుకుంటూ.

* * *

పెళ్లి ఇంకా రెండు రోజులే ఉంది. ఇంటినిండా బంధుసమూహం. ఎలాగైనా సరే సాయంత్రం చెందూను ఒక్కసారి కలుసుకోవాలి. అతని పాట వినాలి. పాపం చెందూ! రోజంతా




చేపలుపట్టి జ్ఞాపకంగా ఇంటివైపు నడిచి అక్కడున్న వాళ్లకు ఇచ్చి వాళ్లు ఇచ్చినవి తెచ్చుకొని ఆశగా తింటాడు. ఎంత దయనీయమైన బ్రతుకు అతనిది. ఇది వరకు బాగానే ఉండేవాడు. తన పెళ్లి గురించి తెలిసి బాధపడుతున్నట్టున్నాడు. బహుశా ఒంటరితనం భయపెడుతుండేమో! తను అతని పరిచయాన్ని పెంచుకొని మరో కొత్త బాధ కలగ చేసింది. చెందూకు బాధపడకూడదని చెప్పాలి. కొంత డబ్బు ఇస్తే తీసుకుంటుడా ఏమో! అభిమానం అభరణం. ఇవే ఆలోచనలతో కొట్టుమిట్టాడుతూ తల్లిని బ్రతిమాలి, సాయంత్రం కాగానే అతని దగ్గరకు వచ్చింది.

ఎప్పటిలా చెందూ సముద్రపు ఒడ్డున కూర్చొని కనిపించని ఆకాశంవైపు చూస్తున్నాడు. చప్పుడుకు తల తిప్పి చూసి తల దించుకున్నాడు.

"చెందూ!" అదే అనురాగం. అదే ఆదరణ.

"ఊఁ" వణికింది అతని కంఠం.

"చెందూ బాధపడకు. ఇలా అవుతుందని నేనూ అనుకోలేదు. అయినా రెండు రోజులు పోయాక నన్ను మరిచిపోయి, మళ్లా నీ ప్రపంచంలోకి వెళ్లిపోతావు, అవునా?" అంది నవ్వుతూ, అతన్ని నవ్వించాలని ప్రయత్నిస్తూ.

ఇదేం వినటంలేదు. మూగగా రోదిస్తున్నాడు. అసలు నువ్వు నాకు ఎందుకు దగ్గరయ్యావు. ఆమెను అడగాలని ఆవేశం కలుగుతుంది. కలిస్తే కలిసింది. నువ్వెందుకు ఆశలు పెంచుకోవాలి ఆమెపై.

"చెందూ!"

ఉలిక్కిపడ్డట్టుగా అయి "ఊఁ" అన్నాడు నీరసంగా.

"ఇది ఇది తీసుకో!" కొన్ని నోట్లు అతని చేతిలో పెట్టి గుప్పిట మూసింది.

"సంధ్యా" వెర్రికేక పెట్టాడు. ఆవేశం, ఆవేదనం ఏదో ఆరాటం.

"ఏమిటి చెందూ" నిదానంగా అడిగింది.

"హాఁ ఈ డబ్బు నా కెందుకు? ఇన్నాళ్లూ నే పాడిన పాటకు ఖరీదా ఇది? దీన్ని నన్నేం చేసుకోమంటావు? పోనీ సమాధి కట్టుకోనా?" పిచ్చిగా అడిగాడు.

"చెందూ" ఆవేదనగా పిలిచింది. "నిన్ను చాలా బాధపెట్టాను. నన్ను క్షమించు." చిన్నగా గొణిగింది.

"వద్దు, అంత మాటనకు- నువ్వు దూరం అవుతున్నావనే బాధ తప్ప మరేం లేదు. వెళ్లిపో సంధ్యా ఇదిగో నీ డబ్బు" అంటూ చేతిని ఆమె ముందుకు చాచాడు.

ఆమె అతని చేతిలో నుండి డబ్బు అందుకోబోయింది. ఆమె చేతిని అలాగే పట్టుకొన్నాడు. నోట్లు ఆమె చేతిలో వుంచి చిన్నగా కంపించే పెదువులతో ముద్రవేశాడు.

"చెందూ" భయంతో అరచింది. కానీ ఆ అరుపు అతనికి వినిపించలేదు. అప్పటికే అతను వెళ్లిపోయాడు పరిగెత్తి లేస్తూ, పడుతూ.

అప్రయత్నంగా ఆమె కంటి నుండి రెండు నీటిబొట్లు రాలిపడ్డాయి. బరువుగా అడుగు ముందుకేసింది.

* * *

ఎక్కడో కోడి కూత పెట్టింది. "అబ్బా!" అని మూలిగి కణతలు రుద్దుకున్నాడు. తలనొప్పి. తెల్లవారబోతుంది. పిచ్చిగా జుత్తు పీక్కున్నాడు. సడన్‌గా అతని కుడిచెయ్యిని ఎడమ చేత్తో తడుముకొన్నాడు. ఈ చెయ్యిది చాలా అదృష్టం. ఆమె చెయ్యి ఎంత మెత్తగా మృదువుగా ఉంది. ఆమెను ఒకసారి కలుసుకుంటే? పిచ్చి కోరిక అతణ్ని మంచంమీద నుండి లేవదీసింది. విసురుగా బయటకు రాబోయి ఆగిపోయాడు. తనెంత అమానుషంగా ప్రవర్తిస్తున్నాడు. అంటే ఆమె కోసం, ఆమె పొందుకోసం తపించిపోతున్నాడా? అవును. ఈ అర్థం లేని ఆవేశం అందుకే! ప్రేమతో, పాలు పోసి పెంచితే పాము పాలే కక్కదు. విషం- పచ్చి విషం- ప్రాణాన్ని తీసే విషం కక్కుతుంది. తను అలాగే ప్రవర్తించాడు ఆమె పట్ల. ఆమె చేతిని అందుకొని ఏం చేసాడు? ఎంత నికృష్టమైన పని చేసాడు. ఈ చేతికి, మూతికి వాత పెట్టుకొంటే ఎలా? ఏదీ సాధ్యం కాదా తనకు. అప్రయత్నంగా దూరంగా ఎక్కడో సన్నాయి మోత వినిపించింది. పెళ్లి. ఎవరికి? సంధ్యకి! ఆమె పెళ్లికూతురిగా ఎలా ఉంటుందో? ఛ! పాపిష్టి వాడు తను- కళ్లుంటే ఆ అమృతమూర్తిని ఒక్కసారి చూసుకునేవాడు. తనకా అదృష్టం లేదు. ఆమె అందించిన మధురమైన స్నేహాన్ని నెమరువేసుకుంటూ ఉంటాడు. ఈ తనువు చాలించే వరకూ ఆమె తలపులతో జీవించాలి. అలా అనుకోగానే తిరిగి వచ్చి మంచంపై వాలిపోయాడు. అలసి ఉన్న అతన్ని నిద్రాదేవి తన కౌగిలిలోకి లాక్కొంది ఆప్యాయంగా.